క్లుప్తంగా

కళాశాలకు రూ.50 వేలు విరాళం


ప్రిన్సిపాల్‌కు విరాళం అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు మల్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం విరాళం అందజేశారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సాయంగా రూ. 50 వేలను ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

బేతంచెర్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్, సిబ్బందికి రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జాబ్‌కార్డు జారీ, ఫాం పాండ్స్, పండ్ల తోటల్లో రింగు ట్రెంచుల ఏర్పాటు, పొలం గట్ల వెంట కందకాల పనులు, అమృత సరోవర్‌లో భాగంగా కుంటల్లో పూడికతీత పనులపై శిక్షణ ఇచ్చారు. మస్టర్, రికార్డు నిర్వహణపై కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ ప్రస్తుతం పూత, పిందె దశలో ఉందని గింజ నాణ్యత, అధిక దిగుబడుల సాధనపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం గుళ్లదూర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ, కంది పంటలను పరిశీలించారు. పంట దశను బట్టి లీటరు నీటికి ఐదు గ్రాముల 13:0:45 లేదా 19:19:19 అనే రసాయన ఎరువులను కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు రబీ వరి పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందని, ఎకరాకు రూ. 126 చొప్పున బీమా కట్టి రసీదు పొందాలని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఇంకా 7 వేల ఎకరాల్లో రైతులు పంట నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు.

మంత్రి బీసీని కలిసిన జెడ్పీ సీఈఓ



బనగానపల్లె రూరల్: మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు మంత్రిని కలిశారు.

ఆన్‌లైన్‌లో భూమి వివరాల నమోదుకు వినతి

ప్యాపిలి: ఆన్‌లైన్‌లో తన భూమి వివరాలు నమోదు చేయాలని అనంతపురం జిల్లా చందన గ్రామానికి చెందిన మహిళా రైతు పుల్లమ్మ మంగళవారం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. ప్యాపిలి మండలం ఎన్‌రాచర్ల గ్రామం సర్వే నంబర్ 475-3లో తనకు 2.5 ఎకరాల పొలం ఉన్నట్లు తెలిపారు. అయితే భూమిలోని 30 సెంట్లను సునీత అనే మహిళ అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని పాస్‌పుస్తకం కూడా పొందినట్లు తెలిపారు. అధికారులు విచారణ చేసి తన 30 సెంట్ల భూమి వివరాలను ఆన్‌లైన్‌లో తన పేరిట నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో 11 కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుందర్ సింగ్ కాలనీ, వైఎస్సార్ నగర్, శ్రీనివాసనగర్, టీచర్స్‌కాలనీ, నెహ్రూనగర్, తారకరామానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

తెరుచుకున్న వైన్ షాప్

సంజామల: ఆకుమల్లలోని మద్యం దుకాణం తెరుచుకుంది. సోమవారం గ్రామంలోని ఓ టీడీపీ నాయకుడు తనకు కమీషన్ ఇవ్వాలని.. లేకుంటే షాపు మూసివేస్తానని యజమానిని బెదిరించి వెంట తెచ్చుకున్న తాళాలు వేసి వెళ్లాడు. మంగళవారం దుకాణ యజమాని ఆకుల మధునాగేంద్ర తాళాలను పగులగొట్టి దుకాణాన్ని తెరిచాడు. టీడీపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మద్యం దుకాణాల లాటరీలో తనకు షాపు వచ్చిందని.. తొలుత సంజామలలో దుకాణం ఏర్పాటు చేయగా టీడీపీ నాయకుల ఒత్తిడితో మూసివేసి కొద్ది రోజుల క్రితం ఆకుమల్లలో ఏర్పాటు చేశానని తెలిపాడు. ఇక్కడ కూడా టీడీపీ నేతలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

కంది రైతులకు నిరాశే

- తగ్గిన దిగుబడులు
- ధర నామమాత్రమే
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- కౌలు రైతుల పరిస్థితి దయనీయం


కంది పంటను కోత కోస్తున్న యంత్రం


కల్లంలో ఆరబెట్టిన కందులు

కొలిమిగుండ్ల/బేతంచెర్ల: గతేడాది కంది క్వింటా ధర రూ.11 వేలకు పైగా ఉండడంతో రైతులు ఎన్నో ఆశలతో ఈ ఏడాది ఖరీఫ్ కలిసొస్తుందనే ఆశతో సాగు చేశారు. పంట మధ్యలో ఉన్న సమయంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడం, పొగమంచు తీవ్రత అధికంగా ఉండడంతో పూత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం మంచి దిగుబడులు వచ్చాయి. నెల క్రితం వరకు రూ.10 వేలు పలకడంతో రైతులు సంతోషంగా నూర్పిడి పనులు మొదలు పెట్టారు. అయితే ధరలు అమాంతం తగ్గుముఖం పట్టడంతో నిరాశ చెందుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం.. పడిపోయిన ధరలు

డోన్ నియోజకవర్గంలో 65 వేల హెక్టార్ల వ్యవసాయ సాగు భూమి ఉండగా అందులో సుమారు 28 వేల హెక్టార్లలో కంది సాగు చేశారు. అలాగే బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అత్యధికంగా 2 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో కోత పనులు మొదలుపెట్టారు. తెలంగాణ నుంచి యంత్రాల సాయంతో కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక్కో ఎకరాకు రూ.1500 నుంచి రూ.1700 వరకు కోత కోసేందుకు తీసుకుంటున్నారు. దిగుబడితో పాటు ధర సైతం పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు మూడు నుంచి ఐదు బస్తాలు మాత్రమే దిగుబడి లభిస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మార్కెట్‌లో రూ.7500 మాత్రమే పలుకుతోంది. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,550 ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించింది.

అయితే రైతులు మాత్రం క్వింటా రూ. 10 వేలకు కొనుగోలు చేస్తే గిట్టుబాటు అవుతుందని.. లేకపోతే పెట్టుబడులు కూడా దక్కవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్లకు చెందిన రైతు వెంకటరంగయ్య 30 ఎకరాల్లో కంది సాగు చేశాడు. పంట కోతల్లో 80 బస్తాలు మాత్రమే దిగుబడి లభించింది. కౌలుకు తీసుకుని పంట సాగు చేసిన వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

పెట్టుబడులు పెరిగాయి



మా మండలంలో సాగునీటి వసతి లేదు. దీంతో వర్షధార పంటగా కంది పంటను సాగు చేశాం. సుమారు 8 ఎకరాల్లో కంది పంటను వేశాను. ఎకరా కంది పంట సాగుకు రూ. 25 వేల నుంచి 30 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర చూస్తే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశాలు లేవు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కాదు.

–రామ సుబ్బయ్య, ముసలాయిచెర్వు, బేతంచెర్ల

డోన్ నియోజకవర్గంలో కంది సాగు వివరాలు	
మండలం	సాగు విస్తీర్ణం
డోన్	11 వేల హెక్టార్లు
బేతంచెర్ల	9 వేల హెక్టార్లు
ప్యాపిలి	8 వేల హెక్టార్లు

రూ. 10 వేలతో కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. 6 నెలల పాటు పడ్డ కష్టానికి 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టిన పెట్టుబడులు దక్కాలంటే క్వింటా రూ. 10 వేలకు కొనుగోలు చేస్తే రైతుకు గిట్టుబాటు అవుతుంది. లేకపోతే రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

–చంద్రశేఖర్‌రెడ్డి, అంబాపురం గ్రామం

పట్ట పగలే చోరీ

డోన్ టౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న నర్సప్ప కాలనీలో మంగళవారం పట్ట పగలే చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న చాంద్‌బాషా కర్నూలులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తి రీత్యా ప్రతి రోజు కర్నూలుకు వెళ్లేవాడు. మంగళవారం ఎప్పటిలాగే ఉద్యోగానికి వెళ్లాడు. భార్య మాబున్ని ఇంటికి తాళం వేసి కొండపేటలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన రెండు ఉంగరాలు, జత కమ్మలు, బ్రాస్‌లైట్, రూ.10 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

20 నుంచి లెప్రసీ కేసుల గుర్తింపు

డోన్ రూరల్: మండలంలో ఈనెల 20 నుంచి ఫిబవరి 2వ తేదీ వరకు లెప్రసీ కేసుల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంభూపాల్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఒక ఆశావర్కర్, ఏఎన్ఎం టీంగా ఏర్పడి ప్రతి రోజు 20 ఇళ్లను సర్వే చేయాలని తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సీహెచ్ఓలు వెంకటలక్ష్మి, వెంకటకుమార్‌రెడ్డి, ప్రణీత్, వెంకట్, ఉమా, సుజాత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు


ముస్తాబవుతున్న పాండురంగస్వామి దేవాలయం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శత నామావళి, మహా మంగళహారతి, నక్షత్ర హారతి, తీర్థప్రసాద వినియోగం, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైకంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేట, యర్రగుడి, కోటపాడు, చింతలాయిపల్లె, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లోని చెన్నకేశవ, కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం మీదుగా భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేయనున్నారు.

కోలుకోలేక బిల్ కలెక్టర్ మృతి

బనగానపల్లె రూరల్: ఆత్మహత్యకు పాల్పడిన బిల్ కలెక్టర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన టి.పుల్లయ్య(62) స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. మద్యానికి బానిసై గ్రామంలో అప్పులు చేశాడు. కుటుంబ పోషణ భారం కావడంతో మనస్థాపం చెంది సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, కుమారుడు సురేష్‌కుమార్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దిలేటిస్వామి ఆలయ క్యాలెండర్ల ఆవిష్కరణ


డైరీ,క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉప కమిషనర్, వేద పండితులు

బేతంచెర్ల: మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సంబంధించి 2025 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఉప కమిషనర్ రామాంజనేయులు, వేద పండితులు మంగళవారం విడుదల చేశారు. ఆలయంలో ఏడాది పాటు జరిగే ఉత్సవ విశేషాలతో పాటు ప్రముఖ పండుగ పర్వదినాల గురించి మొదటిసారి డైరీ, క్యాలెండర్లను తయారు చేయించినట్లు ఉప కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఎల్లనాగయ్య, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ


రామసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: స్థానికంగా నివాసం ఉంటున్న పెద్దకొప్పెర్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇటీవలే ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాటసాని రామిరెడ్డితోపాటు ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, సొదరదిన్నె సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నివాళి

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సయ్యద్‌మహబూబ్‌హుస్సేన్(45) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాటసాని రామిరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎలాంటి సహకారం కావాలన్నా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు మీర్ హుస్సేన్, మహమ్మద్ ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు


కూల్‌డ్రింక్ షాపు యజమానులను హెచ్చరిస్తున్న ఎస్ఐ

డోన్ టౌన్: కూల్‌డ్రింక్ షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శరత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కూల్ డ్రింక్ షాపు యజమానులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ.. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన సంస్కృతి సాంప్రదాయల విశిష్టతను విద్యార్థులకు తెలియజేప్పేలా పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు, మెహందీ, సంప్రదాయ వంటలు, వస్త్రాలంకరణ, ముగ్గుల పోటీలు, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలు శుక్రవారం వరకు కొనసాగుతాయని తెలిపారు. అధ్యాపకులు బడేసాహెబ్, వసుంధర, నీతమ్మ, చంద్రకళ, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న సీఐ, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు జరిగింది. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా, ఓటీపీ, పిన్ నంబర్ అడిగినా చెప్పకూడదన్నారు. సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అంజనేయులు, కెనరా బ్యాంకు మేనేజర్ అంక్కన్న, ప్రిన్సిపాల్ రామలక్ష్మీ, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, ట్రైనర్ అశోక్ పాల్గొన్నారు.

వీఓఏలు బాధ్యతతో పనిచేయాలి

బనగానపల్లె రూరల్: వీఓఏలు బాధ్యతతో విధులు నిర్వహించాలని డీఆర్‌డీఏ వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో సీసీలు, వీఓఏలు, గ్రామైఖ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. కొందరు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎం శ్రీనివాసులు ఉన్నారు.

తల్లికి వందనం అమలు చేయాలని ధర్నా

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకం అమలు చేసి విద్యార్థులను ఆదుకోవాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఎంఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివన్న, ఆర్ఎస్ఎఫ్ రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ చిరంజీవి, మద్దిలేటిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

డోన్ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాస్, పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

బనగానపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ‘సే నో ప్లాస్టిక్’ అనే నినాదంతో పట్టణంలోని వస్త్ర దుకాణాలు, కిరాణ, బేకరీ, కూరగాయాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని డీఎస్పీ సూచించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

డ్రైనేజీ నిర్మాణం


మొదలైన డ్రైనేజీ నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్


కొండపేట బీసీ, ఎస్సీ వసతిగృహం వద్ద నిల్వవున్న మురుగు (ఫైల్)

డోన్: పట్టణంలోని కొండపేట బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల వద్ద ఎట్టకేలకు డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో ఇక్కడ మురుగునీరు, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపించేది. విద్యార్థులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడేవారు. డిసెంబర్ 30వ తేదీ మురుగునీటితో సహవాసం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు సాంఘిక సంక్షేమ అధికారులు స్పందించారు. వసతిగృహం వార్డెన్ మధు తన సొంత ఖర్చుతో డ్రైనేజీని వెడల్పుతో నిర్మించేందుకు ముందుకొచ్చారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించారు.

ఎండు గడ్డికి యమ డిమాండ్


వరిగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతు


మోపులుగా చుట్టిన వరిగడ్డి

సంజామల: మారుతున్న కాలంతో పాటు యాంత్రీకరణ కారణంగా వ్యవసాయ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పశువులకు ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. గతంలో వరిని కోసి ట్రాక్టర్‌తో నూర్పిడి చేసేవారు. పాడి రైతులకు ఎండుగడ్డి పుష్కలంగా లభించేది. రైతులు దానిని పశుగ్రాసంగా ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల కొరత, ట్రాక్టర్ బాడుగులు పెరగడంతో ఖర్చుల ఆదాకు యాంత్రాల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. వరి కోత నుంచి నూర్పిడి వరకు యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీంతో సమయం కూడా ఆదా అవుతోంది. వరికోత మిషన్‌తో గంటల వ్యవధిలోనే మొత్తం ప్రక్రియ పూర్తవుతోంది. అయితే పశుగ్రాస కొరత ఏర్పడుతోంది. మరో వైపు దానా ఖర్చులు తట్టుకోలేక మిషన్ ద్వారా కోసిన గడ్డిని యంత్రాల ద్వారా మోపులుగా చుట్టించి పశువులకు కావాల్సిన ఎండు గడ్డిని సమకూర్చుకుంటున్నారు. ఇలా ఒక్కో మోపు రూ.100 నుంచి రూ.120 వరకు పలుకుతోంది. ఎకరాకు సుమారు 70 నుంచి 80 మోపులు వస్తాయి. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.10 వేలు అయ్యే అవకాశం ఉంది. దీనికి ట్రాక్టర్ బాడుగ అదనం.